## రాష్ట్రస్థాయిలో ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి


జిల్లా స్థాయి కబడ్డీ జట్టుతో వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 23: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ క్రీడాకారులుగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బాలిక ఎడ్యుకేషన్ హబ్‌లో నెహ్రూ యువకేంద్ర సహకారంతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్లాక్‌స్థాయి, జిల్లా స్థాయి సీనియర్ పురుషుల విభాగం, బాలురు, బాలికల జట్ల ఎంపికను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్రీడాపోటీల్లో ప్రతిఒక్కరూ గెలుపోటములను పట్టించుకోకుండా క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. జిల్లాస్థాయి పురుషుల విభాగంలో 16 మంది, బాలురు, బాలికల విభాగంలో 18 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శివకుమార్, కౌన్సిలర్ శ్యామలమల్లేశం, నర్సింహులు పాల్గొన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు ఎల్లయ్య, మల్లేశం, యాదగిరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవపూర్, జనవరి 23: క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందించడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. వట్టిపల్లిలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. పోటీల్లో 18 జట్లు పాల్గొనగా జగదేవపూర్ జట్టు విజేతగా, వట్టిపల్లి రన్నరప్‌గా నిలిశాయి. విజేత జట్టుకు రూ.10వేల నగదు, రన్నరప్‌కు రూ5వేల నగదుతోపాటు కప్‌లు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కనకయ్య, శ్రీదర్‌రావు, మోహన్‌రెడ్డి, కనకయ్య, రామ్‌రెడ్డి, నర్సింహులు, రామచంద్రం, జానీ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- ఎమ్మెల్సీ యాదవరెడ్డి
- జగదేవపూర్‌లో రసాభాసగా గ్రామసభ


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

జగదేవపూర్, జనవరి 23: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం జగదేవపూర్ మండలంలోని ఇటిక్యాల, దౌలాపూర్, కొండాపూర్, జగదేవపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. జగదేవపూర్‌లో సభ జరుగుతున్న క్రమంలో పలువురు అర్హులకు పథకాలు రాలేదని, ఆరు గ్యారంటీలు ఇప్పటి వరకు అమలు కాలేదని ప్రశ్నించడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ మొదలైంది. దీంతో పోలీసులు కలుగజేసుకొని సభను కొనసాగించేలా చర్యలు చేపట్టారు. ఇటిక్యాల సభలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్పీవో లత, ఎంపీడీవో యాదగిరి, ఏవో వసంతరావు, మాజీ సర్పంచ్‌లు చంద్రశేఖర్, లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కవిత, మండల కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## రైతులను నిండాముంచిన రేవంత్


మాట్లాడుతున్న గడీల బైరవరెడ్డి

సిద్దిపేట టౌన్, జనవరి 23: రైతు ప్రభుత్వమని గద్దెనెక్కి, రైతులను నిండాముంచిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని తెలంగాణ రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గడీల బైరవరెడ్డి మండిపడ్డారు. సిద్దిపేటలో గురువారం జరిగిన రైతు సంఘాల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులందరికీ రుణమాఫీ చేస్తానని చెప్పి సగంమందికే రుణమాఫీ చేసి మిగతావారికి కాంగ్రెస్ ఎగనామం పెట్టిందన్నారు. ఇప్పటివరకు వానకాలం రైతు భరోసా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి అన్నపెట్టే రైతన్నలను మోసం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాల నేతలు శ్రీరామ్‌రెడ్డి, రంగారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, మల్లయ్య, సంతోశ్ పాల్గొన్నారు.

## నవజాత శిశువుకు అత్యాధునిక చికిత్స


పాపతో సురభి వైద్య బృందం

సిద్దిపేట అర్బన్, జనవరి 23: కిలో బరువుతో పుట్టిన నవజాత శిశువుకు అత్యాధునిక చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చినట్లు మిట్టపల్లి సురభి మల్టీస్పెషాలిటీ దవాఖాన వైద్యులు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సిద్దిపేటకు చెందిన హరిప్రియ, రామకృష్ణ దంపతులకు పుట్టిన పాపను హైదరాబాద్‌లో చికిత్స అందించిన తర్వాత సురభి దవాఖానకు తీసుకువచ్చారు. సురభి వైద్యబృందం కంగారు మదర్ కేర్ సెంటర్‌లో బేబీకి అత్యాధునిక చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం బేబీ బరువు 1.5 కిలోలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సురభి వైద్యబృందానికి బేబీ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మెడికల్ డైరెక్టర్ రాంప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ దినేశ్, కరుణాకర్, పీడియాట్రీషన్ హెచ్‌వోడీ శివరామాచారి, డా.సందీప్, పీఆర్వో పరుశరాములు ఉన్నారు.

## గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ కవిత

జగదేవపూర్ జనవరి 23: ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క గ్యారంటీని పూర్తిగా అమలు చేయడం లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కవిత, గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు విమర్శించారు. గురువారం జగదేవపూర్‌లో వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా ఇస్తామని గ్రామసభల్లో చెప్పి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మరోసారి ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజల్లో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొమురవెల్లి, జనవరి 23: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలైన ఘటన గురువారం మండలంలోని ఐనాపూర్ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మల్కాజిగిరికి చెందిన సతీశ్(36) స్విగ్గి ఫుడ్ డెలివరీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మల్లన్న దర్శనం కోసం హైదరాబాద్ నుంచి స్నేహితులతో కలిసి నాలుగు ద్విచక్ర వాహనాలపై కొమురవెల్లికి వస్తున్న క్రమంలో ఐనాపూర్ శివారు మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం వెనుకల కూర్చున్న సతీశ్ అక్కడికక్కడే మృతిచెందగా, ద్విచక్ర వాహనం నడుపుతున్న వంశీకి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజు చేరుకొని తీవ్ర గాయాలైన వంశీని అంబులెన్స్‌లో దవాఖానకు తరలించడంతో పాటు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# గ్రామసభల్లో అధికారుల నిలదీత

## మూడో రోజూ నిరసనలు.. నిలదీతలు

చేర్యాల, జనవరి 23: గ్రామసభల్లో అధికారులను ప్రజలు అడుగడుగునా నిలదీశారు. ప్రభుత్వం అర్హులైన వారికి పథకాలు వర్తింపజేయకుండా కాంగ్రెస్ నాయకులకు, వారి బంధువులకు, కార్యకర్తలకు అందజేస్తున్నదని, మంజూరు జాబితాలో వారి పేర్లు తప్ప అర్హులైన పేర్లు లేవంటూ గురువారం చేర్యాల మున్సిపాలిటీ 9వ వార్డు, ముస్త్యాలలో జరిగిన గ్రామసభల్లో ప్రజలు, వివిధ పార్టీల నాయకులు అధికారులను నిలదీశారు. అర్హులైన వారికే ప్రభుత్వ పథకాలు అందించాలని, భవనాలు, 10 ఎకరాలకుపైగా భూమి ఉన్న వారికి, ప్రభుత్వ ఉద్యోగులు తల్లిదండ్రులకు మంజూరు చేసిన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను వెంటనే క్యాన్సల్ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.

**దుబ్బాకలో రసాభసాగా గ్రామసభలు**

దుబ్బాక, జనవరి 23: కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలపై నిర్వహిస్తున్న గ్రామసభలు ప్రజల ఆందోళనలతో రసాభసాగా మారాయి. మూడోరోజు శుక్రవారం దుబ్బాకలో నిర్వహించిన పలు గ్రామసభల్లో ప్రభుత్వ తీరుపై ప్రజలు మండిపడ్డారు. ప్రజాపాలన దరఖాస్తులో పింఛన్లు, ఇండ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ వాటిని పక్కనబెట్టి మళ్లీ దరఖాస్తులు స్వీకరించడం ఏమిటంటూ అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ భరోసా, రుణమాఫీ, రేషన్ కార్డులు రాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దుబ్బాక మండలం ఆరెపల్లిలో రుణమాఫీ కాలేదని పలువురు రైతులు అధికారుల ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. అచ్చుమాయిపల్లి, శిలాజీనగర్, గోసాన్‌పల్లి గ్రామసభల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం అధికారులకు మొరపెట్టుకున్నారు. దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేటలో, 10, 11వ వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్లు జాబితాలో తమ పేర్లు లేవని అధికారులను నిలదీశారు. అర్హులను కాకుండా అనర్హులను ఎంపిక చేశారంటూ పలువురు గొడవ చేశారు. ఈ సందర్భంగా జాబితాలో పేర్లు రాని వారికి తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ విషయంపై ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకోవాలని, జిరాక్స్‌లకు డబ్బులు ఎవరిస్తారంటూ కొందరు అధికారులతో వాగ్వాదానికి దిగారు. హబ్షీపూర్‌లో ఓ యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నందున అక్కడ జరగాల్సిన గ్రామసభ శనివారానికి వాయిదా పడింది. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీవో భాస్కరాశర్మ, ఏవో ప్రవీణ్, ఆర్ఐ నర్సింహారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి**

సిద్దిపేట, జనవరి 23: అరులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని 23, 24, 25, 28వ వార్డుల్లో జరిగిన గ్రామసభల్లో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాయకం లక్ష్మణ్, యోగీశ్వర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

**పలు వార్డుసభల్లో పాల్గొన్న కమిషనర్**

సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో జరిగిన సభల్లో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పాల్గొన్నారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అన్నారు. లబ్ధిదారుల జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేయాలని సూచించారు. 31 వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజుతో కలిసి గ్రామసభలో పాల్గొన్నారు. అనంతరం బుస్సాపూర్‌లోని రిసోర్స్ పార్కులో పర్యటించారు.

**అనర్హుల పేర్లు రావడంపై నిలదీత**

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 23: ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులైన వారికి కాకుండా అనర్హుల పేర్లు రావడంపై గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. మద్దూరు మండలంలోని గాగిల్లాపూర్, రేబర్తి గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

**మగ్రిముచ్చాలలో గ్రామస్తుల వాగ్వాదం**

కొమురవెల్లి, జనవరి 23: ప్రభుత్వం చేపట్టిప గ్రామసభల్లో ప్రజల ఆందోళనలు కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని మర్రిముచ్చాల రైతు వేదికలో నిర్వహించిన గ్రామసభలో ప్రజలు ప్రశ్నల వర్షం కురిపంచారు. ముందుగా అధికారులు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న 400 మంది అర్హుల జాబితాను చదివి వినిపించారు. ఇదే జాబితా ఉండాలని, దీనిలో ఏమైనా మార్పులు ఉంటే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని గ్రామస్తులు అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకుల మధ్య పెద్దఎత్తున వాగ్వాదం జరిగింది. దీంతో బీఆర్ఎస్ నాయకులకు గ్రామస్తులు బాసటగా నిలిచారు.

**అధికారులతో ప్రజల వాగ్వాదం**

మిరుదొడ్డి, జనవరి 23: ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు రసాభసాగా మారాయి. రూ. 2 లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసాపై చర్చిస్తున్న క్రమంలో అధికారులను ప్రజలు నిలదీశారు. గురువారం మిరుదొడ్డి మండలం అల్వాల, ధర్మారం గ్రామాల్లో రూ.2 లక్షల రుణమాఫీకాని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. రూ.2 లక్షలకు పైగా ఉన్న డబ్బులను బ్యాంకుల్లో కట్టినా ప్రభుత్వ నేటికీ రుణమాఫీ చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్, గ్యాస్ సబ్సిడీ డబ్బులు రావడం లేదని మండిపడ్డారు. రైతులను సీఎం మోసం చేస్తున్నారని ఆరోపించారు.

**తూతూమంత్రంగా గ్రామసభలు**

నారాయణరావుపేట, జనవరి 23: అధికారులు తూతూమంత్రంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది, బంజేరుపల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ అర్హతలు ఉన్నా పేర్లు లేకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేసి అధికారులను నిలదీశారు.

**సంక్షేమ పథకాల కోసం నిలదీత**

గజ్వేల్, జనవరి 23: మండల పరిధిలోని అనంతరావుపల్లి, బెజుగామ గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామసభలో సంక్షేమ పథకాలు అర్హులకే ఇవ్వాలని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. బెజుగామలో అర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు రాలేదని ఆందోళన చేశారు. గ్రామస్తులు, అధికారుల మధ్య వాగ్వివాగం చోటుచేసుకుంది. అనంతరావుపల్లిలో గ్రామస్తులకు, అధికారులకు మధ్య ప్రొటోకాల్‌పై వివాదం చోటుచేసుకుంది. కేసీఆర్ ఫొటో లేకపోవడంతో ప్రొటోకాల్ పాటించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీఐ సైదా అక్కడికి చేరుకొని గ్రామస్తుడిపై చెయి చేసుకునే ప్రయత్నం చేయగా వారించడంతో వెనక్కి తగ్గారు.


దుబ్బాక: మండలంలోని లచ్చపేట 11వ వార్డులో రసాభాసగా మారిన గ్రామసభ


మద్దూరు: గాగిల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు


చేర్యాల: అధికారులను ప్రశ్నిస్తున్న ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి తదితరులు


మిరుదొడ్డి: ధర్మారంలో ఇందిరమ్మ ఇండ్లలో నా పేరు రాలేదని అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతు


బెజ్జంకి: తిమ్మాయ్యపల్లిలో గ్రామసభను బహిష్కరిస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు


మిరుదొడ్డి: అల్వాలలో ప్రశ్నిస్తున్న రైతులను కాంగ్రెస్ నేతలు అడ్డు తగలడంతో వీడియో చిత్రీకరిస్తున్న పోలీసు


నారాయణరావుపేట: సంక్షేమ పథకాలు అందడం లేదంటూ గుర్రాలగొంది గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

## ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం

- ఎక్కడికక్కడ అధికారులను నిలదీసిన గ్రామస్తులు
- పోలీసుల పహారాలో సభల నిర్వహణ

సిద్దిపేట, జనవరి 23: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు అధికారులపై విరుసుకుపడ్డారు. దీంతో అధికారులకు ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్‌లో మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీ బాబు, గ్రామశాఖ అధ్యక్షుడు లింగారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఇండ్లు కట్టుకుంటున్న వారికి కాకుండా, కాంగ్రెస్ నాయకులు సూచించిన వారికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చిన్నగుండవెల్లిలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంతమందికి రుణమాఫీ అయింది. రైతు భరోసా పథకాన్ని రెండు పంటలకు ఇవ్వాలంటూ రైతులు, బీఆర్ఎస్ నాయకుడు కిషన్ రెడ్డి అధికారులను నిలదీయడంతో సభ రసాభాసగా మారింది. పెద్దలింగారెడ్డిపల్లిలో యువకులు అధికారులను అడుగడుగునా నిలదీశారు. గతంలో ప్రొసీడింగ్‌లను నమ్మి ఇల్లు కట్టుకుంటే ఇప్పటివరకు బిల్లులు రాలేదని, ఈరోజు ఇచ్చిన లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు రాలేదంటూ నిలదీశారు. నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల జాబితాలో వచ్చిన పేర్లు, గతంలో ఇచ్చిన దరఖాస్తులను ఏం చేశారంటూ మాజీ సర్పంచ్ ఆంజనేయులు అధికారులను నిలదీయడంతోపాటు, బైఠాయించి నిరసన తెలిపారు. మళ్లీ దరఖాస్తులు అంటూ ప్రజలను ఇబ్బందులకు ఎందుకు గురి చేస్తున్నారంటూ చిన్నకోడూరులో బీఆర్ఎస్ నాయకులు కాముని శ్రీనివాస్, జంగిటి శ్రీనివాస్, ప్రజలు అధికారులను నిలదీశారు.


చిన్నగుండవెల్లిలో రసాభాసగా మారిన గ్రామసభ

## విద్యార్థినులు జాతీయ స్థాయిలో రాణించాలి


విజేతలతో ఏసీపీ పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యాయ బృందం


వర్గల్, జనవరి 23: జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు భవిష్యత్తులో ఫుట్‌బాల్ క్రీడలో జాతీయస్థాయిలో రాణించాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. గురువారం వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలేలో జగిరిన అండర్-17 బాలికల జిల్లాస్థాయి ఫుట్‌బాల్ క్రీడల ముగింపునకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. ఫుట్‌బాల్ క్రీడల్లో రాణించిన విద్యార్థినులకు రాష్ట్ర, కేంద్రస్థాయి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. గెలుపోటములు సహజమని, విజయం కోసం సమిష్టిగా రాణించినప్పుడే గెలుపు సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై కరుణాకర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు పంపిణీ


కార్మికులకు దుప్పట్లు అందజేస్తున్న జుబేదాఖాతున్‌ఎక్బాల్

చేర్యాల, జనవరి 23: చేర్యాల పట్టణంలోని 7వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ జుబేదాఖాతున్‌ఎక్బాల్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు గురువారం దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో తన పదవీకాలం ముగియనుండడంతో మున్సిపల్ కార్మికుల నిస్వార్థసేవలకు గుర్తుగా దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. పట్టణ పరిశుభ్రతలో మున్సిపల్ కార్మికుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ మంగోలు చంటి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్, కార్యదర్శి బూరగోని తిరుపతి, అవుశెర్ల కిశోర్, అవుశెర్ల వెంకటేశ్, పచ్చిమడ్ల మానస తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ


మేర్గు మహేశ్‌ను పరామర్శిస్తున్న దళిత సంఘాల నాయకులు

సిద్దిపేట, జనవరి 23: బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు మెరుగు మహేశ్‌ను దళిత సంఘాల నాయకులు గురువారం పరామర్శించారు. మెరుగు మహేశ్ తండ్రి అభ్యుదయ అంబేద్కర్ దళిత సంఘం వ్యవస్థాపకుడు మెరుగు మల్లేశం ఇటీవల మరణించడంతో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎల్లేశ్, జిల్లా నాయకులు గుడిమల్ల సత్తయ్య, బండి రంగయ్య, మోహన్ చంద్రశేఖర్ పరామర్శించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బద్దిరాజు, హరికృష్ణ, విజయ్, ముత్యాల కనకయ్య, వెంకటేశం, రాములు, రామచంద్రం ఉన్నారు.

## గీత పారిశ్రామిక సహకార సంఘం ఏకగ్రీవం

చేర్యాల, జనవరి 23: చేర్యాల గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పచ్చిమడ్ల సిద్దిరాములు గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఎన్నికల అధికారి వర్మ పర్యవేక్షణలో రేణుకాఎల్లమ్మ ఆలయ ఆవరణలో జరిగిన ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా అంబటి గోపి, ప్రధాన కార్యదర్శిగా గుడాల అయిలయ్య, కోశాధికారిగా కూరెల్ల యాదగిరి, డైరెక్టర్లుగా పచ్చిమడ్ల సత్యనారాయణ, బొమ్మకంటి మల్లేశం, సత్యనారాయణ, నాగిల్ల కనకలక్ష్మి, పచ్చిమడ్ల యాదమ్మలను ఎన్నుకున్నారు.

### క్రీడలతో మానసిక ప్రశాంతత


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, జనవరి 23: క్రీడలతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, విద్యార్థులు క్రీడల్లో రాణించాని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు. గురువారం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జిల్లాస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు నచ్చిన క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలని అప్పుడే అనుకున్న లక్ష్యానికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోశ్‌కుమార్, హైదర్ పటేల్, ప్రిన్సిపాల్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### ఆధార్ తరహాలో అపార్

గజ్వేల్, జనవరి 23: నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులను తీసుకొచ్చేందుకు తాజాగా ఆధార్ తరహాలో అపార్ కార్డులను జారీ చేసే ప్రక్రియను ప్రారంభించిందని ఎంఈవో కృష్ణ తెలిపారు. గురువారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ జడ్పీ పాఠశాలలో మండల పరిధిలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాళ్లకు అపార్‌పై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరీమొద్దీన్, శిక్షణ అధికారులు రాజేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ


స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రభాకర్

గజ్వేల్, జనవరి 23: మండల పరిధిలోని దాతర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొత్తపల్లి ప్రభాకర్ తండ్రి భిక్షపతి, కుమారుడు అంశుల్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఉపాధ్యాయురాలు కరుణశ్రీ, కొత్తపల్లి శ్యామ్, గ్రామస్తులు సత్యనారాయణ, మల్లికార్జున్, కరుణాకర్ పాల్గొన్నారు.

### అక్రమంగా నిర్మిస్తున్న చర్చిలపై చర్యలు తీసుకోవాలి

కొండపాక(కుకునూరుపల్లి), జనవరి 23: కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఇల్లు పేరుతో పర్మిషన్ తీసుకొని అక్రమంగా చర్చిలు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం కుకునూరుపల్లి కార్యదర్శికి విశ్వహిందూ పరిషత్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతిప్రతం ఇచ్చారు. కార్యక్రమంలో నందమూరి కిశోర్‌శర్మ, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రత్యేక శ్రద్ధ వహించాలి

బెజ్జంకి, జనవరి 23: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈఐవో రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా వారిని పరీక్షలకు సంసిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The public in general are here by informed that Smt. Kistapuram Laxmi, wife of Sathyanarayana, Resident of Siddipet has approached my client Bank/Finance and release of loan and offered her property of Northern Side Open Place pertaining to H.No. 12-3-56 to an ext. of 120.00 Sq.Yds., situated at Siddipet and the same was bounded by East: Raghavapuram Chandraiah, H.No. 12-3-113, West: Road 18 Feets, North: Open Place of Gaddameedi Ramulu, South: Nagavva H.No. 12-3-56 acquired through Registered Gift Deed D.No. 7221/2005, SRO Siddipet, Later she constructed the House No. 12-3-56/1/a over the said place and further informed that its Original link D.Nos. 7216/2005 and 392/2002, SRO Siddipet pertaining to above property was lost. Hence, the general Public are informed to submit objections/claims if any within (7) days of this publication to me, for sanction and release of loan in respect of the above property in favour of Smt. Kistapuram Laxmi and mortgaging the same in favour of my client Bank/Finance. If no objections are received within the above stipulated time, it shall be deemed that there are no objections and my client will proceed further, Later no objections will be entertained.

Sd/- PINNA RAMULU,
Advocate & Notary Siddipet,
Cell No. +91 9849321422.